నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శుక్రవారం 19 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM

పట్టాభిషేక మహోత్సవంలో స్వామివారి రాజదండాన్ని చూపుతున్న అర్చకుడు

రాజాధిరాజ..

- భద్రగిరిలో కనులపండువగా శ్రీరామ మహాపట్టాభిషేకం
- వజ్రకిరీటం ధరించి.. స్వర్ణ సింహాసనంపై రారాజుగా దర్శనం
- సీతారామచంద్రమూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్
- జగదభిరాముడికి జయజయధ్వానాలతో మురిసిన మిథిలా సామ్రాజ్యం

స్వామివారికి అలంకరించనున్న రాజ ఛత్రాన్ని చూపుతున్న అర్చకులు

ఖమ్మం (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ భద్రాచలం, ఏప్రిల్ 18: దక్షిణ అయోధ్యాపురిగా పేరుగాంచిన భద్రగిరిలో పట్టాభిషిక్తుడైన శ్రీరాముడు రాజాధిరాజుగా దర్శనమిచ్చాడు. స్వర్ణ ఛత్రం, పసిడి పాదుక, రాజదండ, రాజముద్ర, వజ్రకిరీటాలతో స్వర్ణ సింహాసనంపై కొలువుదీరిన జగదభిరాముడు రారాజుగా దర్శనమివ్వడంతో భక్తజనం పులకించిపోయింది. జయజయధ్వానాలతో మిథిలా సామ్రాజ్యం (స్టేడియం) మార్మోగింది. నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సకల గుణాభిరాముడైన భద్రాద్రి రాముడికి గురువారం మహా పట్టాభిషేకం వేడుక మిథిలా స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగింది. రాజలాంఛనాలతో నిర్వహించిన ఈ వేడుకను తిలకించి భక్తజన కోటి పరవశించింది. పట్టాభిషేకం సందర్భంగా భద్రాచలం దేవస్థానం వైదిక సిబ్బంది పావన గోదావరి నది నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో పండితులు తీర్థప్రోక్షణ చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో సీతారాముల కల్యాణం జరిగిన మరుసటి రోజు శ్రీరాముడికి మహాపట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎస్ శాంతికుమారి స్వామివారికి, సీతమ్మతల్లికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. గురువారం మహా పట్టాభిషేకానికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హాజరై పట్టాభిషిక్త రామయ్యకు పట్టువస్త్రాలను సమర్పించారు.



వేదస్వస్తితో శ్రీకారం..

గురువారం ఉదయం సరిగ్గా 10 గంటల నుంచి శ్రీరామ మహాపట్టాభిషేక క్రతువు ప్రారంభం కాగా.. ఆరాధన అనంతరం వేదస్వస్తితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా దేవస్థానం స్థానాచార్యులు స్థలశాయి శ్రీరామ మహా పట్టాభిషేక విశిష్టతను భక్తులకు వివరించారు. దేశంలో దేవతలు ఎంతోమంది ఉన్నా అందరికీ కల్యాణం మాత్రమే జరుగుతుందని, కానీ పట్టాభిషేక వైభవ ఘనత శ్రీరాముడికి మాత్రమే జరుగుతుందని వివరించారు. శ్రీరామ పట్టాభిషేక ఘట్టంలో భాగంగా భద్రాద్రి రామయ్యకు ఒక్కో ఆభరణం ధరింపజేస్తూ.. వాటి విశిష్టతను వివరించారు. తొలుత శ్రీరామ బంగారు పాదుకలు, అనంతరం రాజనీతిని తెలియచేసే రాజదండం, రాజముద్రిక, బంగారు ఛత్రం, రాజఖడ్గం తదితరాలను అర్చకస్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య పట్టాభిషిక్తుడైన రామయ్యకు ధరింపజేశారు. అనంతరం ప్రధాన లాంఛనమైన సామ్రాట్ కిరీటాన్ని రామయ్యకు ధరింపజేశారు. ఆ క్షణంలో భక్తజనకోటి కరతాళధ్వనులతో జేజేలు పలికింది. పురాణాల్లో దేవేంద్రుడు రామయ్యకు కానుకగా పంపినట్లు చెప్పే ముత్యాలహారాన్ని తొలుత రామచంద్రమూర్తికి.. ఆ తర్వాత సీతమ్మ తల్లికి, చివరగా రామభక్త సామ్రాజ్యానికి రారాజు అయిన హనుమంతుడికి సమర్పించి ప్రోక్షణ గావించారు. వేదాశీర్వచనం చేసి అష్టోత్తర శతహారతిని 108 ఒత్తులతో వెలిగించి శ్రీరామచంద్ర ప్రభువుకు సమర్పించడంతో మహాపట్టాభిషేకం సుసంపన్నమైంది. గవర్నర్ రాధాకృష్ణన్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి పాల్గొన్నారు.

నేడు మహదాశీర్వచనం

కల్యాణం జరిగిన మూడోరోజున (శుక్రవారం) రామయ్యకు మహదాశీర్వచనం అందజేయడం సంప్రదాయం. అందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 400 మంది చతుర్వేద పండితుల వేదమంత్రాలతో రామయ్యకు ఆశీర్వచనం అందజేస్తారు. దీనినే సదస్యంగా పిలుస్తారు.

గవర్నర్‌కు స్వాగతం..

తొలుత హెలికాప్టర్ ద్వారా భద్రాచలం చేరుకున్న గవర్నర్‌కు కలెక్టర్ ప్రియాంక, రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయానికి విచ్చేసిన గవర్నర్‌కు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో, వేదమంత్రాలతో ఆహ్వానం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం గవర్నర్‌కు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సమయంలో ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించి దేవస్థానం తరపున శేషవస్త్రాలు, జ్ఞాపిక, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. పట్టాభిషేకం నిర్వహించే మిథిలా స్టేడియానికి తోడ్కొని వచ్చారు.

స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్

కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి తరపున రామయ్యకు పట్టు వస్త్రాల సమర్పణ

సరయూ నుంచి పుణ్య జలాలు.. శ్రీరంగం నుంచి పట్టువస్త్రాలు..

ఆనవాయితీ ప్రకారం సీతారాముల కల్యాణం జరిగిన మరుసటి రోజైన దశమి నాడు శ్రీరామచంద్ర మహాప్రభువుకు వైదికులు మహాపట్టాభిషేకాన్ని వైభవంగా జరిపారు. గురువారం ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం గావించారు. అనంతరం పావన గౌతమీ నది మధ్య భాగం (గోదావరి మధ్య భాగంలో 500 నదులు ప్రవహిస్తాయన్నది పురాణోక్తి) నుంచి అర్చకస్వాములు పవిత్ర జలాలను తీసుకొని వచ్చారు. స్వామివారి ఉత్సవపెరుమాళ్లను సుందరంగా అలంకరించారు. శిల్పకళాశోభితమైన మిథిలా స్టేడియానికి ప్రత్యేక పల్లకీలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను తోడ్కొని వచ్చారు. ముందుగా ఆరాధన, వేదస్వస్తితో వేడుకను ప్రారంభించి విశ్వక్సేన, కర్మణ పుణ్యాహవాచన జరిపి 12 మంది అర్చకస్వాములకు కండువాలు కప్పి వశిష్ఠ మహర్షి, భరత శత్రఘ్నులు, జాంబవంతుడు, అంగదుడు, వాల్మీకీ తదితరులను పట్టాభిషేకానికి ఆహ్వానించారు. స్వామివారికి ఎదురుగా పంచ కలశాలను ఏర్పాటు చేసి అందులో నాలుగు సముద్ర జలాలను, మధ్య కలశంలో 500 నదుల తీర్థాలను ఆవాహన చేశారు. మండపారాధనగా అష్టదిక్పాలకులను, త్రిమూర్తులను ఆవాహన చేసి ఆరాధన జరిపారు. పాదుకల్లో ఆదిశేషుడిని, చామరాల్లో గరుత్మంతుడిని, నైరుతి భాగంలో గోదావరి నదిని ఆవాహనం చేశారు. కుడి వైపున భరతుడిని, ఎడమ వైపున శత్రుఘ్నుడిని, రాజముద్రికలో లక్ష్మీ దేవిని, ఖడ్గంలో నందకుడిని ఆవాహన చేశారు. అయోధ్య సరయూ నదీ నుంచి తెచ్చిన పుణ్యజలాన్ని ఓ వైపున ఉంచారు. ఆగ్నేయం, వాయువ్యం, పశ్చిమల్లో వాసుదేవుడిని, సంకర్షణుడిని, ప్రద్యుమ్నుడిని, అనిరుధుడిని ఆవాహన చేశారు. నాలుగు కలశాల్లో పురుష, సత్య, అచ్యుత,అనంతుడిని, కిరీటంలో నారాయణమూర్తిని ఆవాహన చేశారు. త్రిదండి చిన జీయర్‌స్వామి 1987లో రూ.50 లక్షలతో చేయించి సమర్పించిన పట్టాభిషేక కిరీటాన్ని శుభ ముహూర్తంలో స్వామివారికి అలంకరించారు. పట్టాభిషేకానికి ముందుగా భరతుడు 14 ఏళ్లపాటు పాలన చేసిన పాదుకలను సింహాసనంపై ఉంచి రామయ్యకు సమర్పించారు. తరువాత పట్టాభిషిక్తుడైన రామయ్యకు శ్రీరంగం నుంచి వచ్చిన పట్టువస్త్రాలను సమర్పించారు. తదుపరి శ్రీరామ పట్టాభిషేక మంత్రసంపుటిత అష్టోత్తర శతనామార్చన జరిపారు. చివరగా గురువారం రాత్రి భద్రాచలంలో స్వామి వారికి తిరువీధి సేవ నిర్వహించారు.

దేశం సుభిక్షంగా ఉండాలి

రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్

భద్రాచలం, ఏప్రిల్ 18 : దేశం రామరాజ్యంలా సుభిక్షంగా ఉండాలని, అదే మన లక్ష్యమని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. గురువారం భద్రాచలం పట్టణంలోని మిథిలా స్టేడియంలో శ్రీరామ మహా పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పట్టాభిషేక క్రతువు పూర్తయిన తర్వాత బయట మీడియాతో మాట్లాడారు. కుటుంబం, రాష్ట్రం, దేశంలో శాంతి వెల్లివిరియాలని, దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఏ ఒక్కరికి హాని చేయకూడదని, వీలైతే తోటి వారికి సహాయం చేయాలని ఆయన పేర్కొన్నారు.

సరికొత్త పంథాలో ప్రచారం

హైదరాబాద్‌లో పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం

పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఖమ్మం, ఏప్రిల్ 18 : పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సరికొత్త పంథాలో ప్రచారం విస్తృతంగా చేయాలని, రైతుల సమస్యలే అజెండాగా ప్రజల్లోకి వెళ్లాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కీలక సమీక్ష నిర్వహించిన కేసీఆర్.. ఎంపీ అభ్యర్థులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జడ్పీ చైర్మన్లు, పార్టీ కార్యవర్గ సభ్యులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహంతోపాటు బస్సు యాత్ర రూట్ మ్యాప్ తదితన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఉదయం పొలంబాట పట్టి ఎండిన పొలాలను పరిశీలించిన తర్వాత రోడ్ షోలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారని నామా చెప్పారు. పలుచోట్ల భారీ బహిరంగ సభలకు కూడా ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. కాగా.. ఎన్నికల ఖర్చు కోసం అభ్యర్థులకు నియమావళి ప్రకారం రూ.95 లక్షల చెక్కులను అందజేశారు. సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఆర్జేసీ కృష్ణ, బొమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ వివరాలు త్వరలో వెల్లడిస్తాం: బీఆర్ఎస్

ఖమ్మం, ఏప్రిల్ 18: రెండు రోజుల క్రితం మీడియా, సోషల్ మీడియాలో ప్రచురితమైన బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తల నియామక వార్తలో సమాచార లోపం వల్ల కొన్ని పొరపాట్లు జరిగాయని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పార్టీ ముఖ్యులతో చర్చించి త్వరలోనే నియోజకవర్గ సమన్వయ కమిటీని ప్రకటిస్తామని వెల్లడించారు.

ఈవీఎంల రవాణాకు పకడ్బందీ చర్యలు: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 18 : లోక్‌సభ ఎన్నికల ఈవీఎంల రవాణా కోసం పకడ్బందీ కార్యాచరణ చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈవీఎంల రవాణా, స్ట్రాంగ్ రూంలలో ఏర్పాట్లపై ఐడీవోసీలో గురువారం నిర్వహించిన అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆయా గోదాము నుంచి సెగ్మెంట్ల వారీగా కేటాయించిన ఈవీఎంలను ఆయా సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు జాగ్రత్తగా రవాణా చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఇతర అధికారులు రాజేశ్వరి, ఆప్రిన్, సత్యనారాయణ, పవిత్ర, మదన్‌గోపాల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 18: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీవారి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. స్వాతః కాల అర్చనల అనంతరం యజ్ఞశాలలో నిత్య అనుష్ఠానములు, హోమాలు, మహాపూర్ణాహుతిని అర్చకులు నిర్వహించారు. 9 రోజులుగా విశేష పూజలు అందుకున్న అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి యజ్ఞేశ్వరస్వామి ప్రీత్యర్థం వేదమంత్రోచారణలతో మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ నిర్వహించి ధ్వజపతాకాన్ని అవనతము చేసి గరుడ స్వామికి షోడషోపచార పూజ నిర్వహించారు. స్వామికి పుష్కరిణిలో స్వామివారి ప్రతినిధి చక్రపెరుమాళ్లకు మేళతాళాలతో తోడ్కొని గంగాపూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, శ్రీవారి పుష్కరిణి దాత గుదే వెంకటేశ్వరరావు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

మేమొచ్చిందే టైం..

ఇష్టారీతిన పాఠశాలలకు వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

సమ్మెటివ్ పరీక్షలకు కూడా సకాలంలో రాని పరిస్థితి

పాఠశాలలపై కొరవడిన విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన లేకుండా ఇష్టారీతిన వస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మేము వెళ్లిందే టైం.. అన్నట్లుగా కొందరు ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఒంటిపూట బడులు, మరోవైపు ఎన్నికల హడావుడి నేపథ్యంలో ఎవరు పట్టించుకుంటారనే ధోరణిలో ఇలా వేళాపాళా లేకుండా పాఠశాలలకు వెళ్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉదయం 7.50 నిమిషాలకు పాఠశాలకు హాజరుకావాల్సిన ఉపాధ్యాయులు ఉదయం 8.30 గంటలకు కూడా పూర్తిస్థాయిలో రాలేని పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. పాఠశాలల్లో సమ్మెటివ్ పరీక్షలు జరుగుతున్న తరుణంలో కూడా సకాలంలో పాఠశాలలకు రావట్లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నగరంలోని పాఠశాలల్లోనే పరిస్థితి ఇలా ఉంటే.. మండల, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

భిన్నాభిప్రాయాలు..

కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు షెడ్యూల్ ప్రకారం ఉదయం పాఠశాలకు వస్తుండగా.. మరికొందరు మాత్రం ఇష్టారీతిన వస్తున్నారు. దీనిపై కొందరు హెచ్ఎంలతోపాటు ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న బాధ్యులు ప్రశ్నించడంతో ఒకరిపై మరొకరు ఇష్టారీతిన వాగ్వాదానికి దిగుతూ ఆరోపణలు చేసుకుంటున్న సంఘటనలున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో నిత్యం కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటనలు చేస్తుంటారు. ఇలాంటి ప్రధాన కూడళ్లలోని పాఠశాలల్లో సైతం సమయపాలన కొరవడిందంటే విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో స్పష్టమవుతోంది. కొన్ని పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఒకరోజు ఒకరు ముందుగా, మరో రోజు ఇంకొకరు ముందుగా వచ్చేలా ఒప్పందం కుదుర్చుకొని పాఠశాలలకు వస్తున్నారనే ఆరోపణలున్నాయి.

వేళకు రాకపోతే చర్యలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నిర్దేశించిన సమయానికి పాఠశాలకు హాజరుకావాలి. సమయపాలన పాటించకపోతే ఆయా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం. ఎంఈవోలు పాఠశాలలను పర్యవేక్షించేలా ఆదేశిస్తాం. సమ్మెటివ్ పరీక్షలతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులు ఉదయం 7.50 గంటలకు పాఠశాలలకు వెళ్లాల్సిందే.

– డీఈవో సోమశేఖర శర్మ

వ్యయ పరిశీలన పారదర్శకంగా ఉండాలి

టీవీలు, పత్రికలు, సోషల్‌మీడియాల్లో ప్రచారాలపై పర్యవేక్షణ

ప్రచార వ్యయాన్ని అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగానే పరిగణించాలి

కంట్రోల్ రూం తనిఖీలో ఎన్నికల వ్యయ పరిశీలకులు, కలెక్టర్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 18: ఎన్నికల వ్యయ పరిశీలనను సంబంధిత అధికారులు పారదర్శకంగా చేపట్టాలని ఖమ్మం పార్లమెంటు ఎన్నికల వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాద్ కృష్ణస్వామి, శంకర నంద్ మిశ్రాలు సూచించారు. ఖమ్మం ఐడీవోసీకి గురువారం చేరుకున్న వారు.. కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి లోక్‌సభ ఎన్నికల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమును, మీడియా సర్టిఫికేషన్, మీడియా మానిటరింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిఘా కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాలను కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. నిఘా బృందాలకు సీసీ కెమెరాలు, జీపీఎస్ ట్యాగ్ సిస్టం అమర్చినట్లు తెలిపారు. కంట్రోల్ రూంలో ఏర్పాటు చెసిన స్క్రీన్ల ద్వారా వాటిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. సీ-విజిల్, 1950 టోల్ ఫ్రీ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం నాటికి సీ-విజిల్ ద్వారా 38 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ ద్వారా 64 ఫిర్యాదులు అందగా.. వాటిని పరిష్కరించినట్లు తెలిపారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీ ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మాధ్యమాలు, సోషల్ మీడియా ప్రచారంపై పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రచార ఖర్చును అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా పరిగణిస్తూ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐడీవోసీలో కంట్రోల్ రూం, మానిటరింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు

తొలిరోజు ఒక్కటే నామినేషన్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 18: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో తొలి రోజు గురువారం ఒక నామినేషన్ దాఖలైంది. ఆదార్ పార్టీ తరపున కుక్కల నాగయ్య అనే అభ్యర్థి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. కాగా, నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు కలెక్టర్ కార్యాలయంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ రెండు మూడు రోజుల్లో తమ నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

నామినేషన్ స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్

మహాక్రతువు సక్సెస్ చేసినందుకు అభినందనలు

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : అధికార యంత్రాం గం సమన్వయంతో భద్రాచలం సీతారాముల కల్యాణం, రామ య్య పట్టాభిషేక మహోత్సవాలు విజయవంతమయ్యాయని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల గురువారం అభినందనలు తెలిపారు. వేడుకల నిర్వహణకు, అధికారులకు కేటాయించిన విధులను సమన్వయంతో సమర్థవంతంగా పూర్తి చేసి మన్ననలు పొందారని అన్నారు. రెండు రోజులపాటు మహాక్రతువు దిగ్విజయంగా జరగడం.. జిల్లా యంత్రాంగం సలహాలు, సూచనలను భక్తులు పాటిస్తూ పూర్తిస్థాయిలో సహకరించారని అన్నారు. మహోత్సవ వేడుకల సమాచారం ఎప్పటికప్పుడు భక్తులకు అందించిన పాత్రికేయులను కలెక్టర్ అభినందించారు. భక్తులు ఎంత మంది వచ్చినా ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూశామన్నారు. దేవాదాయ శాఖ సెక్రటరీ, కమిషనర్ వేడుకలకు ముందు నుంచే ఏర్పాట్లలో ఉన్నారని, ప్రతి ఉద్యోగి బాధ్యతతో పని చేశారని ఆమె పేర్కొన్నారు.

గవర్నర్, రాష్ట్ర అధికార యంత్రాంగంతో కలెక్టర్ ప్రియాంక ఆల

సీఎంపీఎఫ్ క్లెయిమ్స్‌కు 'ఆన్‌లైన్'

సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 18 : కార్మికుల సీఎంపీఎఫ్ క్లెయిమ్స్ ఆన్‌లైన్ ద్వారా సెటిల్‌మెంట్ చేసేందుకు సీ-డీఏసీ సంస్థ అభివృద్ధి చేసిన సీ-కేర్స్ పోర్టల్‌లో ఫైనాన్షియల్ మాడ్యూల్‌ను రూపకల్పన చేయనున్నట్లు సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. హెడ్డాఫీస్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మాడ్యూల్స్ రూపకల్పనపై విధివిధానాలు, సింగరేణి సంస్థ నుంచి కావాల్సిన సమాచారంపై సంబంధిత ఉన్నతాధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గుగని కార్మికులు, ఉద్యోగుల సీఎంపీఎఫ్ క్లెయిమ్స్, పెన్షన్ పైకం ఆన్‌లైన్‌లో నేరుగా సీఎంపీఎఫ్ లెడ్జర్ కార్డులో పోస్టింగ్ చేయడానికి వీలుగా ఫైనాన్షియల్ మాడ్యూల్ రూపొందించేందుకు కావాల్సిన విధివిధానాలపై సుధీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్, సీ డాక్ ఈడీ సుదర్శన్, సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి, జనరల్ మేనేజర్(పర్సనల్) బసవయ్య, జీఎం పర్సనల్ హనుమంతరావు, జీఎం ఐటీ రాంకుమార్‌రావు, జీఎం సుబ్బారావు, సీ డాక్ జాయింట్ డైరెక్టర్ మోహిత్ వేద్, సిద్ధార్థ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం